కథ

# పగటి కలలు



## రస్మిత

రస్మిత

అనగనగా ఒక ఊరిలో ఒక అమ్మాయి వుండేది. ఆ అమ్మాయి రోజూ ఆవు పాలు పితికి ఊరిలో అమ్మడానికి వెళ్ళేది. వచ్చిన డబ్బులతో రోజులు గడుపుకునేది.

ఒక రోజు ఆవు మామూలుగా కన్నా కొంచం యెక్కువ పాలు ఇచ్చింది. అది చూసి అమ్మాయి చాల సంతోషించింది. రోజు తీసుకువెళ్ళే బిందె కన్నా పెద్ద బిందిలో పాలు నింపుకుని తలపైన పెట్టుకుని ఊరివైపు బయలుదేరింది.



దారిలో సంతోశంగా నడుచుకుంటూ యెన్నో ఊహలు అల్లటం మొదలెట్టింది. “ఈ రోజు ఇచ్చినట్టు రోజు ఆవు పాలు ఇస్తే నాకు రోజు యెక్కువ ఆదాయం వస్తుంది.

ఆ వచ్చిన అధికపు ఆదాయం నేను ఖర్చు పెట్టకుండా ఒక మూటలో దాచేస్తాను.

కొద్ది రోజులకి ఆ మూటలో చాలా డబ్బులు జమవుతాయి. అప్పుడు ఇంకో ఆవుని కొంటాను. అలా, అలా కొద్ది రోజులలో నా దెగ్గిర చాలా ఆవులు వుంటాయి.

అవి చూసుకోటాని పాలేరాళ్ళను పెడతాను. నేను రోజూ ఇలా యెండలో ఊరికి వెళ్ళే అవసరం వుండదు. అప్పుడు నేను కూడ తెల్లగా అయిపోతాను.

వెళ్ళి ఒక కొత్త పట్టు చీర కొనుక్కుంటాను. కొత్త పట్టు చీరలో నేను చాల అందంగా కనిపిస్తాను. చీరకు తగ్గట్టు సంతలో గాజులు, గొలుసు కూడ కొనుక్కుంటాను.

ఊరిలో యెవరింట్లోనైనా పెళ్ళి ఐతే, ఆ పెళ్ళికి చక్కగా తలస్నానం చేసి, కొత్త పట్టు చీర కట్టుకుని, నగలు పెట్టుకుని, జడలో పూలు పెట్టుకుని వెళ్తాను.

అక్కడ నేను ధగ ధగా మెరిసిపోతూ చాలా అందంగా కనిపించగానే నాకు చాలా సంబంధాలు చెబుతారు. కాని నాకు నచ్చిన సంబంధం వచ్చే దాక నేను యేది ఒప్పుకోను”

నచ్చని సంబంధం ఒప్పుకోను అనుకుంటూ ఆ అమ్మయి గట్టిగా తల అడ్డంగా ఊపింది. తల మీద రోజు మోసేదానికన్నా యెక్కువ బరువు వుందన్న విషయం మరిచిపోయింది.

ఢదేలుమని బిందె తలనించి పడి ముక్కలయి పోయింది. పాలన్నీ నేలపాలయ్యాయి.

ఆ పాలూ అమ్మలేదూ, యెక్కువ డబ్బులూ సంపాదించలేదు, ఆవులూ కొనలేదూ, పాలెరాళ్ళనీ పెట్టుకోలేదు, పట్టు చీరా కొనలేదు, గాజులూ కొనలేదు– ఊహించినవన్నీ ఊహలలోనే వుండి పోయాయి.

పగటి కలలు కనే బదులు చేస్తున్న పని శ్రద్ధగా చేస్తే బాగుండేదని బాధ పడుతూ ఆ అమ్మాయి తిరిగి ఇంటివైపుకు వెళ్ళి పోయింది.

***

# నేటి బాల్యం ప్రశ్నార్థకం

బాల్యం అద్భుతమైన అనుభూతుల నిలయం
ఆటల వలన పెరుగుతుంది ఆత్మవిశ్వాసం
పల్లెటూర్లలో ఈ ఆటలు ప్రతి ఒక్కరి సొంతం
ఆరుబయట పాదరక్షలు లేకుండా ఆడే ఆటలు అద్వితీయం
అలుపు సొలుపు లేకుండా అంబరాన్నంటే సంబరం
ఏ ఆట ఆడినా బలపడుతుంది శారీరక, మానసిక సామర్థ్యం
ఆటల వలన చక్కటి వ్యాయామం
చెమ్మ చెక్క, తొక్కుడు బిళ్ళ ఆడేటి ఆడపిల్లలు
కోతి కొమ్మచ్చి, తాడు బొంగరం, గోళీల ఆటలు ఆడేటి మగ పిల్లలు
చెడుగుడు ఆట పెంచుతుంది శారీరక దారుఢ్యం
ఇసుకలో గుజ్జన గూళ్ళు కట్టుకుంటూ
కూడగట్టేవారు నైపుణ్యం
నేటి ఆధునిక కాలంలో సమయపాలన లేని జీవిత చక్రం
నాలుగు గోడల మధ్య బందీ అయి దిక్కుతోచని స్థితిలో బిక్కుమంటుంది బాల్యం
మించిన బరువుతో కూడిన పుస్తకాలతో భారంగా ముందుకెళ్తోంది బాల్యం
తోటి వారితో ఆత్మీయ నేస్తంగా కలిసి పంచుకోలేకపోతుంది బాల్యం
ఎంతసేపు ఆన్లైన్ గేమ్స్ తో
అవుతుంది ఆగం
విజ్ఞానాన్ని పొందే క్రమంలో కోల్పోయే మనోల్లాసం
పల్లెల్లో ఆడే ఆటలు నేడు కంటికి కనిపించనంత దూరం
వాటి పేర్లు కూడా కానరాకుండా పోయాయన్నది నిజం
ప్రతిఒక్కరి బాల్యం చదువుల పేరు చెప్పి
బందీ అవుతున్న నేపథ్యం
ఇలా అయితే బాల్యం అవుతుంది అయోమయం



డాక్టర్ రవీంద్రబాబు అరవా



కథ

# రత్తాలు

వి విజయశ్రీదుర్గ

సోఫాలో కూర్చుని పుస్తకాలు సర్దుకుంటున్న సిద్ధుని, శ్రీనిధిని చుస్తూ ఉండి పోయింది. కార్ డ్రైవర్ కూతురు రత్తాలు.

స్కూల్ బస్ రానే వచ్చింది పదండి బస్ ఎక్కండి అంటు లలిత అన్నదో లేదో పరుగు పరుగున బస్ ఎక్కారు సిద్ధు, శ్రీనిధ.

రత్తాలుకి తాను కూడా చదువుకోవాలి బడికెళ్ళాలని ఉంది కాని ఆ కొరిక తీరదని అనుకుంటుంది ఎప్పుడు స్కూల్ బస్ చూసినా పుస్తకాలు చూసినా రత్తాలు ఎంతో సంబరపడుతూ ఉండటం గమనించింది లలిత.



నేను చదివిస్తాను నీవు చదువుకుంటావా చెప్పు అంది లలిత రత్తాలుతో.

చదువుకుంటాను అమ్మగారు. చదువు అంటే ఎంతో ఇష్టం అన్నది రత్తాలు ఆవేశముగా.

సరే పద నిన్ను ఆ ప్రభుత్వ బడిలో చేర్పిస్తాను అంటు వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ లలిత చేర్పించింది ప్రభుత్వ బడిలో .

తల్లి చనిపోయింది తండ్రి సంరక్షణలో పెరుగుతోంది రత్తాలు.

ఒకరోజు లలిత రత్తాలుని కూర్చోపెట్టి చదువుకొని ఏమవుతావు పెద్ద అయ్యాక అని అడిగింది.

వెంటనే రత్తాలు టీచర్ అవుతాను పిల్లలకి పాఠాలు చెపుతాను అంటు ఉంటె..

లలిత ఎంతో మురిసిపోతూ ఇలాగా చెప్పింది రత్తాలుకి. చదువు జీవితాన్నే మార్చేస్తుంది. మనిషిలో నమ్మకాన్ని పెంచుతుంది. నడక నడత మార్చేస్తాయి అలాగే మన ఊరికి వచ్చే ఎర్ర బస్సు పై రాసిన పేరు ఎవరిని అడగకుండా తెలుసుకోవచ్చు రత్తాలు.

చదువు మూడో నేత్రం అన్నారు పెద్దలు “విద్య లేని వాడు వింత పశువు”చదువు వల్ల మనో వికాసం పెరుగుతుంది. మరి నీవు మా పిల్లల కన్నా మంచి స్థితిలోకి రావాలని మనసారా ఆ వాగ్దేవిని కోరుకుంటున్నాను అంది లలిత రత్తాలుని దీవిస్తూ.

రత్తాలు చదువు పై శ్రద్ధ చూపటం ఎంతో గొప్ప విషయం. పేదరికం ఒంటరితనం అధిగమించి అభిలాషను సంకల్పం బలం గాని ఉంటే ఏమైనా సాధించ గలడు నిజం చెప్పాలి అంటే రత్తాలు వీధి బాలలకు ఆదర్శం మరి బాల్యంలో జీవితం చిందర వందర కాకుండా చేసుకోవాలి రత్తాలు రేపటి యువకిరణము మరి.

***